సాక్షి
కర్నూలు
సోమవారం । 4 । మార్చి । 2024



మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: సెలవురోజు కావడంతో ఆదివారం మహానంది ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం నిర్విరామంగా కొనసాగింది.



480 క్యూసెక్కుల నీటి ప్రవాహం

హొళగుంద: ఎల్లెల్సీలో 480 క్యూసెక్కులు నీరు ప్రవహిస్తోంది. తాగునీటి అవసరాల నిమిత్తం టీబీ డ్యాం నుంచి విడుదల చేస్తున్న నీరు ఈ నెల 10న బంద్ చేయనున్నారు.



ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కర్నూలు మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం రాత్రి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 15 మందికి బంగారు పతకాలు అందజేశారు. 8లో▸

ఈ వేసవి నిప్పుల కొలిమే!

- ముందే మొదలైన ఎండలు
- పెరిగిన భానుడి భగభగలు
- సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- కర్నూలులోని ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్ల ఏర్పాటు



కర్నూలు కలెక్టరేట్ వద్ద నీడకోసం ఏర్పాటు చేసిన చలువ పందిరి

కర్నూలు(అగ్రికల్చర్): భానుడు భగభగమంటున్నాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎండల తీవ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉంటోంది. వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. గతేడాది ఇదే సమయంలో 35 నుంచి 36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుతం 39 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మార్చి నెల చివరిలోపు ఉష్ణోగ్రతలు 43, ఏప్రిల్ నెలలో 45, మే నెలలో 48 డిగ్రీలకు చేరే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో అధికారులు ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కర్నూలు నగరంలో ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు వడదెబ్బకు గురికాకుండా జిల్లా నీటియాజమాన్య సంస్థ చర్యలు చేపట్టింది. షేడ్‌నెట్‌లు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ సరఫరా చేయడానికి రంగం సిద్ధం చేస్తోంది.

ఎల్‌నినో ప్రభావం..

పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా మారాయి. 2023 –24లో అనావృష్టి పరిస్థితులు ఏర్పడటానికి ఎల్‌నినో కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు తేల్చారు. దీని ప్రభావం మే నెల చివరి వరకు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో వేసవి మొత్తం నిప్పుల కొలిమిలా ఉండే ప్ర మాదం ఉంది. జూన్ నుంచి ఎల్‌నినో ప్రభావం తగ్గి లానినో ప్రభావం చూపే అవకాశం ఉంది. లానినో ప్రభావం ఉంటే అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది.

చలివేంద్రాల ఏర్పాటు

ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తూ వేసవి ఉపశమన చర్యలు చేపట్టింది. కర్నూలులో కలెక్టరేట్, కలెక్టరేట్ దగ్గర ఉన్న బస్టాపు, రాజ్‌విహార్ సెంటరు, సి.క్యాంపు సెంటరు బస్టాపు, నగరపాలక సంస్థ కార్యాలయం బస్టాపు తదితర ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ అధికారులు చలువ పందిళ్లు వేశారు. ఇప్పటికే కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయడం విశేషం.

ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణాలు ఇవే...

- ➤ అడవులు తరిగిపోతుండటం, పచ్చదనం కనుమరుగు అవుతుండటం ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణం అవుతోంది.
- ➤ కర్నూలు జిల్లా విస్తీర్ణంలో అడవులు 33 శాతం వరకు ఉండాల్సి ఉంది. అయితే జిల్లాలో 16 శాతం మాత్రమే అడవులు ఉన్నాయి.
- ➤ పెరుగుతున్న వాయు కాలుష్యం ఎండల తీవ్రత పెరగడానికి కారణమవుతోంది.
- ➤ ఓజోన్ పొర దెబ్బతింటుండటంతో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటోంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండలు, వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉన్నందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం బయటకు వెళ్లిన వారు 11 గంటలలోపు ఇంటికి చేరుకోవాలి. ఎండలో తప్పనిసరిగా తిరగాలివస్తే గొడుగు ధరించాలి. లేదంటే తలపైన టోపీ, టువాలతో కప్పుకోవడం అవసరం. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలి. దాహం వేయకపోయినా తరచూ చల్లని నీరు తీసుకోవాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, కొబ్బరి నీళ్లు వీలైనంత వరకు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు బయటతిరుగరాదు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో నమోదవుతున్నాయి. మార్చి రెండో పక్షంలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి రెండోపక్షం నుంచే మొదలయ్యాయి. ఫిబ్రవరి 27న కర్నూలు జిల్లాలో హొళగుందలో 38.4, ఆదోనిలో 38.1, కోడుమూరులో 38.1, గూడూరులో 37.6 డిగ్రీలు, నంద్యాల జిల్లా చాగలమర్రిలో 38.8, బండిఆత్మకూరులో 38.3, ఆత్మకూరులో 38.2, అవుకులో 38.2, మిడుతూరులో 38.1 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫిబ్రవరి 28న మంత్రాలయంలో 37.9, కౌతాళంలో 37.9, గోనెగండ్లలో 37.8, కొత్తపల్లిలో 37.9, ఆత్మకూరు, బనగానపల్లె,చాగలమర్రిలో 37.8 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం కర్నూలు నగరంలో గరిష్ఠంగా 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



ఈ సారి ఎండలు ఎక్కువే



వేసవిలో ఉష్ణోగ్రతలు పతాక స్థాయికి చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం సాధారణ ఉష్ణోగ్రతల కంటే రెండు డిగ్రీల వరకు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి వేసవి ముందుగానే మొదలైంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. – **అశోక్‌కుమార్, వాతావరణ శాస్త్రవేత, రేకులకుంట, అనంతపురం జిల్లా**

ఉద్యోగ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ కృష్ణకాంత్



కర్నూలు: ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలపై నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీ సమయాల్లో పనిచేసి అదనపు ఆదాయాన్ని ఆర్జించవచ్చంటూ ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని సూచించారు. నిరుద్యోగ యువతను లక్ష్యం చేసుకుని ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాలని నమ్మబలికి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కొందరైతే ఏకంగా ఇంటర్వ్యూలు నిర్వహించి మోసం చేస్తున్నారని, ఇలాంటి ఘటనలు ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్నాయని తెలిపారు. ఆకట్టుకునే ప్రకటనలు చూసి కొందరు రెజ్యూమ్‌లు అప్‌లోడ్ చేస్తున్నారని, వాటి నుంచి వివరాలను సేకరించి సైబర్ నేరగాళ్లు తరచూ ఫోన్లు చేస్తూ.. మాటల్లో వ్యక్తిగత విషయాలు కనుగొని మోసాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ పేరిట మరేదైనా కారణం చెప్పి వ్యక్తిగత ఖాతాల్లో డబ్బులు జమ చేయమని మభ్యపెడతారని, అలా జమ చేసినవారు చాలామంది డబ్బులు కోల్పోయారని తెలిపారు. ఉద్యోగ ప్రకటన వెబ్‌సైట్ సరైనదో కాదో క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. అందులో పేర్కొన్న మొబైల్ నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తీసుకోకూడదని, స్వయంగా కార్యాలయాన్ని సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. ఏ సంస్థ/కంపెనీ అయినా జీతాలు ఇచ్చి ఉద్యోగులను నియమించుకుంటాయని, డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇవ్వవనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బ్యాంకు అకౌంట్లు, ట్యాక్స్ ఫామ్స్, పాన్ నంబర్, ఆధార్ కార్డు తదితర వివరాలు అడుగుతున్నారంటేనే అనుమానించాలని సూచించారు. అపరిచితులకు డబ్బులు బదిలీ చేసే ముందు ఒక్క క్షణం ఆలోచించుకోవాలన్నారు. ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో మోసం జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ పేర్కొన్నారు. సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి కాల్ చేయాలని లేదంటే www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని జిల్లా ప్రజలకు ఎస్పీ కృష్ణకాంత్ తెలియజేశారు.

న్యూస్‌రీల్

ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



వైద్య కళాశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న కల్నల్ జోబి ఫిలిప్

కర్నూలు (టౌన్): ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కల్నల్ జోబి ఫిలిప్ అన్నారు. ఆదివారం స్థానిక కర్నూలు వైద్య కళాశాల సమావేశ హాలులో ఎన్‌సీసీ విద్యార్థులకు సీ సర్టిఫికెట్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ కోసం జిల్లాలో 400 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు.

7న 'చేయూత' నిధుల విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ చేయూత కింద 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు వరుసగా నాలుగో ఏడాది నిధులు ఈ నెల 7న విడుదల కానున్నాయి. 2020–21 నుంచి వైఎస్ఆర్ చేయూత అమలు అవుతోంది. ఇది వరకు మూడు విడతల్లో మహిళల సంక్షేమానికి రూ.666.50 కోట్లు మహిళల బ్యాంకు ఖాతాలకు విడుదలయ్యాయి. ఈ నెల 7న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రూ.18,750 ప్రకారం 1.50 లక్షల మంది మహిళల ఖాతాలకు రూ.250 కోట్లు విడుదల చేయనున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు డీఆర్‌డీఏ–వైకేపీ అధికారులు, సిబ్బంది ముందస్తు కార్యక్రమాలు చేపడుతారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘాల వారిగా సమావేశాలు నిర్వహించి మూడు విడతల్లో చేయూత కింద ఎంతమేర నిధులు విడుదలయ్యాయి... 4వ విడతలో విడుదలయ్యే నిధుల వివరాలను మహిళలకు డీఆర్‌డీఏ–వైకేపీ సిబ్బంది వివరిస్తారు. చేయూత నిధులను వినియోగించుకొని వివిధ జీవనోపాధుల్లో రాణిస్తున్న మహిళల విజయగాథలను సేకరిస్తామని ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు. నిధులు విడుదలయ్యే 7వ తేదీ నుంచి వారం రోజుల పాటు మండల, నియోజకవర్గ స్థాయిలో చేయూత సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

జేఎల్ పోస్టులకు అర్హుల జాబితా

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌లో జూనియర్ లెక్చరర్(జేఎల్) పోస్టులకు జీఓఎంఎస్ నంబరు 79 ప్రకారం అర్హులైన వారి జాబితాను జిల్లా విద్యాశాఖ తయారు చేసిందని డీఈఓ కాగిత శామ్యూల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులై ఉండి ఈ జాబితాలో పేర్లు లేని వారు ఎవరైనా ఉంటే, అలాగే జాబితాలో పేర్లపై అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో నేటి(సోమవారం) ఉదయం11 గంటల్లోపు డీఈఓ ఆఫీస్ ఏడీ(సర్వీసెస్)కు తెలియజేయాలని సూచించారు. ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే తమ దగ్గర ఉన్న జాబితాను తుది జాబితాగా పరిగణిస్తామని పేర్కొన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాల నిర్వహణ స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ ఎడ్యుకేషన్) సంయుక్త సీనియారిటీ జాబితాను తయారు చేశామని తెలిపారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- చెరువులో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి




మృతి చెందిన అమీర్, దేవేంద్ర

కౌతాళం: ఈత సరదా ఇద్దరు ప్రాణాలు తీసింది. ఆదివారం సెలవు కావడంతో సరదాగా స్నేహితుడితో కలిసి ఈత కొడుదాం అని చెరువుకు వెళ్లిన విద్యార్థులు మృత్యువాత పడ్డారు. చిరుతపల్లి గ్రామంలోని పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న అమీర్, దేవేంద్ర, యువరాజులు ముగ్గురు కలిసి స్థానిక చెరువులో ఈతకొట్టేందుకు వెళ్లారు. ముందుగా అమీర్, దేవేంద్ర చెరువులోకి వెళ్లి మునిగిపోయారు. ఈ విషయాన్ని గమనించిన యువరాజు గ్రామానికి చేరుకుని, విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు చెరువు వద్దకు వెవెళ్లి మునిగి పోయిన విద్యార్థుల్ని బయటకు తీయగా అమీర్ (11), దేవెంద్ర (11)లు అప్పటికే మృతి చెందారు. గ్రామానికి చెందిన బాషా, జలాల్‌బీలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా.. ఇందులో అమీర్ ఆదివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన కరెప్ప మార్తెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా.. పెద్ద కుమారుడు దేవేంద్ర మృత్యువాత పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.


హంస వాహనాధీశా.. హరోం హర..



హంస వాహనంపై కొలువై ఉన్న స్వామి అమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయిస్తున్న దృశ్యం

- శ్రీశైలంలో వైభవంగా మల్లన్న బ్రహ్మోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవ కాంతులతో శ్రీగిరి కళకళలాడుతోంది. భ్రమరాంబికతో కలసి మల్లికార్జునుడు హంస వాహనంపై దర్శనమివ్వగా స్వామిఅమ్మవార్లను కనులారా దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు. శ్రీగిరి క్షేత్రం భక్తుల శివనామస్మరణతో మారుమోగుతోంది. శ్రీశైల పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు హంస వాహనసేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్దగల అక్కమహాదేవి అలంకార మండపంలో హంస వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను హంస వాహనంపై ఆశీనులను చేసి ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, వేద పండితులు వేదమంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజా హారతులనిచ్చారు. మంగళవాయిద్యాలు మారుమోగగా, భక్తుల శివనామస్మరణతో హంసవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయించారు. అనంతరం పరివార దేవతామూర్తులకు ప్రత్యేక కర్పూర నీరాజనాలు సమర్పించి దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు గ్రామోత్సవానికి తరలించారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో వివిధ కళారూపాలు, డప్పు వాయిద్యాలు, కర్ణాటక నృత్యాలు, డోలు, బీరప్పలు, మహిళల కోలాటలు, కళాకారుల నృత్యాలు గ్రామోత్సవానికి మరింత వన్నె తెచ్చాయి. హంసవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించి ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. ఈ గ్రామోత్సవంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



కంపార్టుమెంట్‌లో వేచి ఉన్న శివమాలధారులు

పట్టు వస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఈఓ, చైర్మన్

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కె.రాంబాబు, కార్యనిర్వహణాధికారి కేఎస్.రామారావు, అర్చకులు, వేదపండితులు, ధర్మకర్తల మండలి సభ్యులు స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు (టౌన్): జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి నిండైన జీవితాన్ని ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని ఎ.క్యాంపు ఇందిరా గాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో చిన్నారులకు ఆమె పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం అందరి బాధ్యత అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. జిల్లాలో 3,48,071 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారని, వీరి కోసం 1,600 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రయాణంలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో 52 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇటుక బట్టీలు, భవన నిర్మాణ ప్రాంతాలు, సంచార జాతుల గుడారాలు వంటి చోట్ల పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 63 మొబైల్ బృందాలను నియమించామన్నారు. ఏదేని కారణం చేత పోలియో చుక్కలు వేయించుకొని పిల్లలకు ఈనెల 4, 5, 6 తేదీల్లో ఇంటింటికి వైద్య బృందాలు తిరిగి పోలియో చుక్కలు వేస్తాయన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో స్టేట్ నోడల్ ఆఫీసర్ రవీంద్ర రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య, డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డీఈఓ శామ్యూల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేరికల పేరుతో టీడీపీ డ్రామా!

- తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకే కండువా కప్పిన వైనం
- హాస్యాస్పదంగా ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి చర్యలు



టీడీపీ తరఫున 2019లో ప్రచారం చేస్తున్న రామకృష్ణారెడ్డి



తాజాగా పార్టీ కండువా కప్పుకున్న రామకృష్ణారెడ్డి (సర్కిల్‌లో వ్యక్తి)

కర్నూలు: టీడీపీలో చేరికల పేరుతో ఆ పార్టీ కోడుమూరు నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి సరికొత్త డ్రామాకు తెరలేపారు. టీడీపీ పాత కార్యకర్తలకే కొత్తగా కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించుకుంటున్నారు. వీరంతా 2019 ఎన్నికల్లో ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి తరఫున టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజినేయులుకు ఓటు వేయాలంటూ ప్రచారం చేసిన వారే కావడం గమనార్హం. నేడు వారికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంటూ ముద్రవేసి టీడీపీ కండువాలు ఫొటోలకు ఫోజులిచ్చి ప్రచార ఆర్భాటాన్ని చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అనుగొండ రామక్రిష్ణారెడ్డి ఆదివారం 50 కుటుంబాలతో టీడీపీలో చేరినట్లు ఎదురూరు విషవర్ధన్‌రెడ్డితో కండువా వేయించుకున్నాడు. అయితే 2019ఎన్నికల్లో అనుగొండ రామక్రిష్ణారెడ్డి బూర్ల రామాంజినేయులుకు ఓట్లు వేయాలని ప్రచారం చేసిన వ్యక్తి. గ్రామంలో ఎలాంటి ప్రజా బలం లేకపోగా గతంలో పక్కా గృహాలు, పింఛన్లు మంజూరు చేయిస్తానని పేద ప్రజల నుంచి వేలాది రూపాయాలు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇసుక మాఫియాలో అంతా టీడీపీ నాయకులే!

ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి వర్కూరుకు చెందిన ఇసుక మాఫియాకు చెందిన టీడీపీ నాయకులు మద్దతు పలికారు. 2020లో టీడీపీ నాయకుడు ప్రతాప్ కుమారుడు అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తోలుతుండగా కోడుమూరు సీఐ పార్థసారధి రెడ్డి పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ట్రాక్టర్‌తో ఢీకొట్టి సీఐను చంపేందుకు ప్రయత్నించాడు. ఈ విషయం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. ఇసుక మాఫియాలో ప్రతాప్, తుమ్మిళ్ల మద్దిలేటి, అశోక్, కొళాయిల రాముడు ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. వీరంతా టీడీపీ నాయకులే. అయితే వీరంతా వైఎస్సార్‌సీపీకి చెందిన వారని వారికి టీడీపీ కండువాలు కప్పి విష్ణు తప్పుడు ప్రచారానికి తెరలేపారు. ఇప్పటి వరకు విష్ణువర్ధన్‌రెడ్డి కండువాలు వేసి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించుకున్న వారంతా టీడీపీ కార్యకర్తలేనని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలెవ్వరు టీడీపీలో చేరడం లేదని సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి స్పష్టం చేశారు.

పర్యాటక కేంద్రంగా మద్దిలేటయ్య క్షేత్రం

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మద్దిలేటి స్వామి క్షేత్రంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన, ఎంపీ పోచా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం రూ. 6 కోట్లతో ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి మంత్రి బుగ్గన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులు, జరుగుతున్న నిర్మాణ పనులపై మంత్రి ఆలయ ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు, అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, టూరిజం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈశ్వరయ్యతో చర్చించారు. పర్యాటకంగా చేపట్టే అభివృద్ధి పనులను మ్యాప్ ద్వారా మంత్రికి టూరిజం శాఖ అధికారులు వివరించారు. కార్యక్రమానికి ముందు వారు మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను దర్శించుకున్నారు. పూజల అనంతరం వారికి స్వామి పట్టు వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేసి వేదపండితులు ఆశీర్వదించారు.

ముచ్చట్లలో రూ.1.90 కోట్ల పునరుద్ధరణ పనులు

శైవ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో రూ.1.90 కోట్లతో చేపట్టే ఆలయ పునరుద్ధరణ పనులకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలసి ఆవిష్కరించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గాలి గోపురం నిర్మాణ పనులు, కల్యాణ మండపం, దేవతా కల్యాణ మండపం, ఫ్లోరింగ్, తేరు షెడ్డు, రథం పునురుద్ధరణ పనులపై ఆలయ అధికారులకు మంత్రి బుగ్గన పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆలయ ఆవరణంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు చేపట్టి భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. పురాతన ఆలయ అభివృద్ధికి చొరవ చూపి రూ. 3 కోట్లతో రహదారి వేయించడమే కాకుండా ఆలయ పునరుద్ధరణకు రూ. 1.90 కోట్లు మంజూరు చేయించిన మంత్రి బుగ్గనను ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండా జగన్ మోహన్ రావు, భక్తులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మద్దిలేటి, డీఈ శ్రీనివాస ప్రసాద్, ఆలయ మాజీ చైర్మన్ యమసాని జగన్ మోహన్ రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళి, మద్దిలేటిస్వామి ఆలయ మాజీ చైర్మన్లు లక్ష్మీరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, భక్తులు భజన కృష్ణయ్య, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు బుగ్గన రమణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, యాదగిరి వెంకటేశ్వర్లు, బళ్లాని సూర్య, శేఖరయ్య, తిమ్మయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

డోలమైట్ అక్రమ రవాణా.. వాహనాల సీజ్

కర్నూలు (న్యూటౌన్): డోన్ నుంచి బెంగళూరుకు డోలమైట్ పౌడర్, ముడి ఖనిజాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న లారీతో పాటు రెండు టిప్పర్లను సీజ్ చేసి డోన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. ఆదివారం డోన్ దగ్గర జిల్లా మైనింగ్ అధికారులు తనిఖీలు చేయగా..ఈ వాహనాలు పట్టుబడ్డాయన్నారు. లారీని సీజ్ చేసి రూ.50 వేలు జరిమానా విధించి వసూలు చేశామన్నారు. రెండు టిప్పర్‌లను సీజ్ చేసి ఒక్కోదానికి రూ.20వేల చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ బాలునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్: నాగనాథన హళ్లి వద్ద బీరప్ప వంకలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఆదోని రూరల్ ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప నియోజకవర్గం కె. బెళగల్ గ్రామంలో 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను తక్కువ రేటుకు కొనుగోలు చేసి పింజరి దూద్‌పీరా, పింజరి పీర్‌సాబ్, పింజరి షేక్షావలి, పింజరి దిల్వార్ హుసేన్, బోయ మునిస్వామి, ఈడిగ అంజి, మాదిగ లక్ష్మీనారాయణ తీసుకొని వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. 34 బాక్సుల్లో 3264 టెట్రా ప్యాకెట్లు ఉన్నాయన్నారు. కర్ణాటక మద్యంతో పాటు ఐదు మోటర్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. దాడుల్లో పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్న పీరయ్య , ఇస్వీ ఎస్‌ఐ. కె. శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది రామయ్య, సుదర్శన్, నీలకంఠ, కిరణ్‌కుమార్, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన రామచంద్రుడు

కర్నూలు: నగర శివారులోని నంది కొట్కూరు రోడ్డులో ఒమేగా హాస్పిటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారపేటకు చెందిన బొగ్గుల రామచంద్రుడు (31) తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అర్ధరాత్రి సమయంలో తీవ్ర గాయాలతో రోడ్డుపై పడివుండగా గస్తీ విధుల్లో ఉన్న మూడో పట్టణ కానిస్టేబుల్ నారాయణ గుర్తించి ఆటోలో ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించారు. ఆదివారం ఉదయం కోలుకోలేక మృతిచెందాడు. ఈయన ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఈయన అక్కడికి ఎందుకు వెళ్లాడు, ఏ వాహనం ఢీకొట్టింది అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. తల్లి సుశీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాద ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ చంద్ర తెలిపారు.

2.2 లక్షల ఎకరాల్లో పంటలకు ఈకేవైసీ

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24 రబీ సీజన్‌లో 2,33,401 ఎకరాల్లో పంటలు సాగు కాగా.. 2,22,394 ఎకరాలల్లో సాగు చేసిన పంటలను 66789 మంది రైతులు ఈ-కేవైసీతో ధ్రువీకరించారు. మరోవైపు ఈ-క్రాప్ నమోదు జాబితాలను వ్యవసాయ శాఖ రైతు భరోసా కేంద్రాల వారీగా సామాజిక తనిఖీలకు పెట్టింది. సామాజిక తనిఖీలు కూడా ఈ నెల మూడో తేదీతో పూర్తయ్యాయి. పంటల నమోదుపై అభ్యంతరాలు ఉంటే రైతులు రాతపూర్వకంగా సంబంధిత ఆర్‌బీకే ఇన్‌చార్జీకి ఇవ్వవచ్చు. అభ్యంతరాలను ఈ నెల 5వ తేదీలోపు పరిష్కరిస్తారు. ఈ నెల 7న రబీ పంటల నమోదు తుది జాబితాలను ప్రకటిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు.

వైద్యం..అపు'రూపం'

- మారిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల రూపురేఖలు
- నాడు-నేడు పనులతో 15 సీహెచ్‌సీలకు నూతన సొబగులు
- రూ.119.20 కోట్లు ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు


బనగానపల్లె ఏరియా ఆసుపత్రి భవనం



కోడుమూరు సామాజిక ఆరోగ్య కేంద్రం


ఓర్వకల్లు సీహెచ్‌సీ భవనం

కర్నూలు(హాస్పిటల్): పాడు బడిన భవనాలు.. పేరుకుపోయిన చెత్తాచెదారం.. పనిచేయని ల్యాబ్‌లు.. అరకొర సిబ్బంది.. అస్వస్థతతో సామాజిక ఆరోగ్య కేంద్రాలు (కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల)కు వెళ్లిన రోగులకు ఒకప్పుడు కనిపించిన దృశ్యాలు ఇవి..నేడు అందమైన భవనాలు..అహ్లాదకరమైన వాతావరణం.. అధునాతన ల్యాబ్‌లు.. అందుబాటులో సిబ్బంది.. రోగంతో వెళితే వెంటనే నయం చేసేలా వైద్య సౌకర్యాలు.. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీలు) నేడు అభివృద్ధి బాట పట్టాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల రూపురేఖలు మార్చేందుకు చర్యలు తీసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో నూతన భవనాలు వెలిశాయి. వైద్యులే కానరాని చోట ఇప్పుడు ఆపరేషన్లు కూడా జరుగుతున్నాయి. అన్ని చోట్ల ఎక్స్‌రే యూనిట్లు ఏర్పాటు చేశారు.

'నాడు-నేడు' పనులతో మారిన రూపురేఖలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైద్యవిధాన పరిషత్ కింద ఆదోనిలో మాతాశిశు కేంద్రం, వంద పడకల ఏరియా ఆసుపత్రి, ఎమ్మిగనూరులో ఏరియా ఆసుపత్రితో పాటు 15 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. యాభై ఏళ్ల క్రితం నిర్మాణం చేసుకున్న ఈ ఆసుపత్రులు శిథిలావస్థలో ఉండేవి. నాడు-నేడు పనులతో వీటి రూపురేఖలు సమూలంగా మా ర్చారు. పాత వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.119.20కోట్లను ఖర్చు చేసింది. మొత్తం 16 భవనాల పనులు చేపట్టగా ఇప్పటికే దాదాపుగా అన్ని భవనాలు తుది దశకు చేరుకున్నాయి.

పెరిగిన వైద్యుల సంఖ్య

గతంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఒక గైనకాలజిస్టు, ఒక పీడియాట్రిస్ట్, ఒక అనెస్తెటిస్ట్ పోస్టులు మాత్రమే ఉండేవి. అందులోనూ చాలా పోస్టులు ఎప్పుడూ ఖాళీగా ఉండేవి. ఈ కారణంగా వైద్యం కోసం సీహెచ్‌సీలకు వెళ్లే వారి సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వాటిపై దృష్టి సారించింది. గైనకాలజిస్టు, పీడియాట్రిషియన్, అనెస్తెటిస్ట్‌తో పాటు ఒక జనరల్ మెడిసిన్, ఒక జనరల్ సర్జన్, ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్థాయి వైద్యులను నియమించింది. ఇందులో ఒక సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి వెళ్తున్నారు. మిగిలిన ఆరుగురు వైద్యులు ఇక్కడే ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. వీరితో నర్సులు, ఫార్మాసిస్టులు, రేడియోగ్రాఫర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో తదితర సిబ్బంది కలిపి ప్రతి సీహెచ్‌సీలో 31 మంది వరకు పోస్టులు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల పరిధిలో సాధారణ, సిజేరియన్ ప్రసవాలతో పాటు రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స చేయడంతో పాటు అత్యవసర మెడికల్ వైద్యాన్ని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద అందిస్తున్నారు. ఈ మేరకు ఆయా సీహెచ్‌సీ భవనాల్లో మౌలిక వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నారు. పెద్ద పెద్ద జబ్బులకు మాత్రమే కర్నూలు, నంద్యాల లాంటి ఆసుపత్రులకు రోగులను రెఫర్ చేసేందుకు విధంగా వైద్యులను తీర్చి దిద్దుతున్నారు. అన్ని ఆసుపత్రుల్లో ఎక్స్‌రే యూనిట్లను ఏర్పాటు చేసేందుకు గాను వాటిని కొనుగోలు చేసి పంపిస్తున్నారు.

గుండెపోటు రోగులకు ప్రాథమిక చికిత్స

స్టెమి ప్రోగ్రామ్ కింద రాష్ట్ర ప్రభుత్వం సీహెచ్‌సీల్లో గుండెపోటు వచ్చిన వారికి సత్వర వైద్యం అందిస్తోంది. ఈ మేరకు గుండెపోటుకు గురైన వచ్చిన వారి ప్రాణాలు కాపాడేందుకు ఖరీదైన ఇంజెక్షన్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 200 మంది దాకా వైద్యం అందించారు. ప్రతి సీహెచ్‌సీలో ఐసీయూ బెడ్‌తో పాటు ఈసీజీ మిషన్లను అందుబాటులో ఉంచారు.

ఆసుపత్రుల ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులు

ఆసుపత్రి పేరు	పడకల సంఖ్య	కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)
ఆదోని ఏరియా ఆసుపత్రి	100	10.48
డోన్ ఏరియా ఆసుపత్రి	100	26.00
బనగానపల్లె సీహెచ్‌సీ	100	22.00
కోవెలకుంట్ల సీహెచ్‌సీ	30	3.80
అవుకు సీహెచ్‌సీ	30	2.43
డోన్ సీహెచ్‌సీ	50	3.00
ఎమ్మిగనూరు సీహెచ్‌సీ	100	12.60
ఆళ్లగడ్డ సీహెచ్‌సీ	50	12.60
ఆలూరు సీహెచ్‌సీ	30	2.73
కోడుమూరు సీహెచ్‌సీ	30	2.22
యాళ్లూరు సీహెచ్‌సీ	30	5.33
ఓర్వకల్లు సీహెచ్‌సీ	30	5.84
వెల్దుర్తి సీహెచ్‌సీ	30	5.77
ఆత్మకూరు సీహెచ్‌సీ	30	3.20
వెలుగోడు సీహెచ్‌సీ	30	6.10


ఆత్మకూరు సీహెచ్‌సీ భవనం

అందుబాటులోకి నూతన భవనాలు



రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో మూడు ఏరియా ఆసుపత్రులు, 13 సీహెచ్‌సీలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నాం. ఇందులో యాళ్లూరు సీహెచ్‌సీ మినహా అన్ని భవనాలు దాదాపుగా పూర్తయ్యాయి. త్వరలో వీటిని రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నాం. వాటిలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

–శివకుమార్, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ, కర్నూలు

రోగులకు మెరుగైన వైద్యసేవలు



ప్రస్తుతం సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. దీంతోపాటు కొత్త భవనాలు, సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం గుండెపోటు వచ్చిన వారికి సైతం సీహెచ్‌సీల్లో ప్రాథమిక చికిత్స అందిస్తున్నాం.

–డాక్టర్ ఆర్. మాధవి, డీసీహెచ్ఎస్, కర్నూలు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల(అర్బన్): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా గ్రామీణ ఓటర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు కోరారు. నంద్యాల మండలం కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌ను కలెక్టర్, ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాలలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. కలెక్టర్ వెంట నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జున్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లౌకికతత్వాన్ని కాపాడుకోవాలి

– సెక్యులర్ ఫోరం సదస్సులో వక్తల పిలుపు


మాట్లాడుతున్న విజయశంకర్ స్వామీజీ

కర్నూలు కల్చరల్: లౌకికతత్వాన్ని కాపాడుకోడానికి ప్రజలు కులమతాలకు అతీతంగా ఐక్యమై ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. 'లౌకిక తత్వాన్ని కాపాడుకుందాం – మతోన్మాదులను ఓడిద్దాం 'అనే అంశంపై కర్నూలు సెక్యులర్ ఫోరం ఆధ్వర్యంలో ఈడెన్ గార్డెన్‌లో సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి, జయహో జాతీయ అధ్యక్షులు విజయశంకర్ స్వామీజీ మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలోనే బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా హిందువులు ముస్లింలు కలసి ఐక్యంగా పోరాటాలు చేశారన్నారు. దానికి ప్రత్యక్ష ఉదాహరణ ఆర్య సమాజ్ సభ్యుడైన రాంప్రసాద్ బిస్మిల్, సంప్రదాయ ముస్లిం మతస్తుడైన అష్ఫాకుల్లా ఖాన్ అని పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ మన్సూర్ రెహమాన్ మాట్లాడుతూ.. నేటి పాలకులు భారతదేశ చరిత్రను వక్రీకరించి మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కర్నూలు మాజీ శాసనసభ్యులు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ. రాష్ట్రాల హక్కులను ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ జబ్బర్ మౌలానా మునీర్ అహ్మద్, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎస్ సుభాన్, నగర అధ్యక్షులు ఎగ్బాల్ హుసేన్, సెక్యులర్ ఫోరం నగర నాయకులు నాసిర్, సివిల్ ఫోరం కన్వీనర్ ప్రసాద్ శర్మ, గౌస్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన కృష్ణుడు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురం గ్రామానికి చెందిన గొల్ల కృష్ణుడు(61) అనే వ్యక్తి శనివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని ఓ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బావి సమీపంలో గొర్రెలను మేపుతున్న కాపరులు తాగునీటి కోసం బావి దగ్గరకు వెళ్లగా నీటిపై మృతదేహం తెలియాడుతుండటం గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు బావిలోని మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడు తనకున్న ఎకరం పొలంతో పాటు మరో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేయగా, దిగుబడులు రాక అప్పులు అయ్యాయని, అప్పులోళ్ల ఒత్తిళ్లు ఎక్కువకావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టానికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదాన పథకానికి రూ.3లక్షల విరాళాలు


రూ.2 లక్షల విరాళాన్ని అందజేస్తున్న హైదరాబాద్‌కు చెందిన దాత సోమశేఖరబాబు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి పలువురు భక్తులు రూ.3లక్షల విరాళాలను అందించారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన కె.సోమశేఖరబాబు అన్నప్రసాద వితరణకు రూ.2,02,232 విరాళాన్ని ఆలయ ఏఈవో ఫణిధర ప్రసాద్‌కు అందజేశారు. అలాగే కృష్ణా జిల్లాకు చెందిన జ్యోష్ణకుమార్ రూ.1,01,015 విరాళాన్ని అందించారు. విరాళాలను అందించిన దాతలకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

మల్లన్న సేవలో ..


పూనం మాలకొండయ్యకు స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఏపీ సీఎం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య దర్శించుకున్నారు. ఆదివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఆమెకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమె మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో అమెకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

మహిళా వైద్యుల 'వాక్‌థాన్'


వాక్‌థాన్ నిర్వహిస్తున్న ఐఎంఏ మహిళా విభాగం వైద్యులు

కర్నూలు (టౌన్): నగరంలో ఆదివారం ఐఎంఏ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా వైద్యులు స్థానిక రైల్వే స్టేషన్ సర్కిల్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బి. క్యాంపులోని ఐఎంఏ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి శ్యామల మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పీజీ వైద్య విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాజీ డీఎంహెచ్ఓ డాక్టర్ నిరుపమ నృత్య ప్రదర్శన అలరించింది. అనంతరం హైదరబాద్ కేర్ ఆసుపత్రికి చెందిన మంజుల అగానీ, సుధాసిన్హాలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం కార్యదర్శి విష్ణు ప్రియ, కోశాధికారి లక్ష్మీబాయి, సీఎస్ఆర్ఎంఓ హేమనళిని, విజయలక్ష్మీ (గైనిక్) ప్రొఫెసర్ సుహాసిని, రేణుక పాల్గొన్నారు.

ఆర్థిక భవనం.. ప్రారంభానికి సిద్ధం!

- రూ.13.45 కోట్లతో నిర్మాణం
- ట్రెజరీ, స్టేట్ అడిట్, ఏపీజీఎల్ఐ, పే అండ్ అకౌంట్ విభాగాలన్నీ ఒకే సముదాయంలో


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఫైనాన్స్ బిల్డింగ్

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లకు సౌకర్యంగా ఉండే విధంగా ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని విభాగాలను ఒకే సముదాయంలోకి తీసుకొస్తూ కర్నూలు నగరంలో సమీకృత ఆర్థిక భవనాన్ని నిర్మించారు. ఈ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. 2018లో ఈ భవనం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చినప్పటికీ అప్పట్లో ఒక్క రూపా యి కూడా నిధులు విడుదల కాలేదు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరువతో రూ.13.45 కో ట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో బి. క్యాంపులోని సీఐడీ కార్యాలయానికి సమీపంలో అ పార్టుమెంట్ తరహాలో 16.50సెంట్ల స్థలంలో (7000 చదరపు అడుగులు) జీ+3 అంతస్తులతో భ వనాన్ని నిర్మించారు. ఏపీఈడబ్ల్యూడీసీ ఇంజినీరింగ్ అధికారులు ఇందులో లిఫ్ట్ సదుపాయం కూడా కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఫైనాన్స్ లోగో తో పాటు స్టీల్ లెటర్స్‌తో పేరు కూడా రాయించడం పూర్తయ్యింది. పెండింగ్‌లో ఉన్న చిన్న, చిన్న పనులను జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు, ఏపీఈడబ్ల్యూడీసీ ఇఇ నారాయణ, డీఈ నాగరాజు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

ఆర్థిక శాఖ కార్యాలయాలన్నీ ఒకే సముదాయంలోకి

ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయాలను ఒకే సముదాయంలోకి తెస్తుండటం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లకు ఊరట కలిగించే విషయం. ఇప్పటి వరకు ఒక్కో కార్యాలయం ఒకచోట ఉండటం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్థిక శాఖకు చెందిన జిల్లా ట్రెజరీ కార్యాలయం, స్టేట్ ఆడిట్(లోకల్‌ఫండ్), ఏపీజీఎల్ఐ, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాలు ఆర్థిక శాఖకు సంబందించినవి. ఇవన్నీ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ బిల్డింగ్ లోకి రానున్నాయి. ప్రస్తుతం ట్రెజరీ కార్యాలయం కలెక్టరేట్, స్టేట్ అడిట్ కార్యాలయం సంక్షేమ భవన్, ఏపీజీఎల్ఐ కార్యాలయం బుధవారపేట, పే అండ్ అకౌంట్స్ విభాగం ఈద్గా దగ్గర ఉన్నాయి. ప్రభుత్వం తీసుకున్న చొరువతో ఇవన్నీ ఒకే సముదాయంలోకి రానున్నాయి. కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయం సీ.క్యాంపు సెంటరులో ఉంది. దీనిని కూడా ఫైనాన్స్ బిల్డింగ్‌లోకి తీసుకెళ్లేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.


ప్రమాణం చేస్తూ..


వైద్య విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

కేఎంసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగుతూ..


కార్యక్రమానికి హాజరైన వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు


పాటలు పాడుతున్న వైద్య విద్యార్థులు


సుశీల్ నాయక్ అనే విద్యార్థికి యాక్సిడెంట్ కావడంతో తల్లిదండ్రులకు జ్ఞాపికను అందజేస్తున్న వైద్యులు

కర్నూలు (టౌన్): కర్నూలు మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం రాత్రి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ అతిథిగా హాజరయ్యారు. వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు చక్కని సేవలు అందించి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం వైద్య విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి, మాజీ ప్రిన్సిపాల్ జిక్కి, డాక్టర్ సుధాకర్, సీఎస్ఆర్ఎంఓ తదితరులు పాల్గొన్నారు.

15 మందికి బంగారు పతకాలు

వైద్య విద్యలో ప్రతిభ చాటిన 15మందికి బంగారు పతకాలు అందజేశారు. సర్జరీ, ఫోరెన్సిక్, మైక్రోబయాలజీ విభాగంలో నమ్రత బంగారు పతకం దక్కించుకున్నారు. బయోకెమిస్ట్రీలో నాగహరిత, పెథాలజీలో సాయితరుణ్, వెంకట వైష్ణవి, ఆప్తమాలజీలో నాగహారిక, సాయితరుణ్, గైనిక్ విభాగంలో వంశీకృష్ణ, కీర్తన..బంగారు పతకాలు దక్కించుకున్నారు.